తేదీ 22.11.2007, విశ్వవిద్యాలయ 26వ స్నాతకోత్సవం

# అందరూ ఒక్కటే అని గుర్తించినవాడే నిజమైన విద్యావంతుడు

**ప్రేమస్వరూపులారా!** నిద్దురనుండి లేచి మరి నిద్దుర పోయెడుదాక డబ్బుకై యుద్ధము చేయుచు కాలము వ్యర్థము చేయగనేల? ఏది చేయవలెనో అది చేయక అనవసరమైన విషయములలో పాల్గొని, మీ కాలమును, కర్మను, కర్తవ్యమును వ్యర్థము చేయటం మంచిది కాదు. కాలము పవిత్రమైనది, శాశ్వతమైనది. Time waste is life waste (కాలాన్ని వ్యర్థం చేయడం జీవితాన్ని వ్యర్థం చేయడమే). మీరు విద్యార్థులు; మిగిలినవారికి నాయకులు కావలసి నటువంటి వారు. కాబట్టి, మీరు ఆదర్శప్రాయులుగా నిలవాలి. అప్పుడే ఇతరులు కూడను ఆదర్శప్రాయులుగా తయారవుతారు. కోరికలు ప్రతి మానవునికి ఉన్నవి. అవి ఒకదాని తరువాత ఒకటి అనేకముగా ఆవిర్భవిస్తుంటాయి. వాటిని అదుపులో ఉంచుకోవడం విద్యార్థులయొక్క కర్తవ్యము. అదే విద్యార్థులయొక్క ప్రధాన లక్ష్యము. మీరు ఆదర్శ వంతమైన పిల్లలుగా తయారవుతారనే మిమ్మల్ని మేము ఎంతో ప్రేమతో పెంచుతున్నాము. బయటి విద్యాసంస్థలయందు ప్రతిదానికీ ధనము, ధనము, ధనము! కాని, మన విద్యాసంస్థయందు ఒక్క నయాపైసాకూడను మేము పుచ్చుకోవడం లేదు. విద్యాసంస్థలద్వారాగాని, వైద్యసంస్థలద్వారాగాని, మంచినీటి పథకములద్వారాగాని ఎట్టి ఆదాయమూ మాకు రావడం లేదు. పిల్లలకి మేమే ఇస్తున్నాము. ఏమీ లేని పిల్లలకు మేము అన్నివిధాలుగా సహాయం చేసి వారి అభివృద్ధికి తోడ్పడుతున్నాము. ఈ సత్యాన్ని మీరు గుర్తించి వర్తించాలి.

sri sathyasai vahiniamrutam

**అంతర్ముఖమైన జీవితానికి తోడ్పడునదే విద్య**

విద్యయే మీయొక్క నిజమైన ప్రోపర్టీ. 'విద్' అనే పదమునుండి వచ్చినటువంటిదే విద్య. 'విద్' అనగా వెలుగు. విద్య మనకు వెలుగు నందిస్తుంది; చిక్కులను విడదీసి దారిచూపుతుంది. విద్య అనేది కేవలం భౌతికమైన జీవితమునకు సహాయం చేయటంకోసం, ఈ ప్రపంచంలో మానవుడు తన జీవితాన్ని పోషించుకోవడంకోసం ఏర్పడినదని మీరు భావించరాదు. విద్యాహీను లైనటువంటివారుకూడను ఈ భౌతికమైన జీవితమును గడుపుతూనే ఉన్నారు. ఎన్నో విద్యలు నేర్చి, ఎమ్.ఎస్సి., ఎమ్.ఎ., ఎమ్.బి.ఎ. డిగ్రీలు చేసి మీరు కూడను ఆవిధమైన మార్గములోనే ప్రవేశిస్తే మీ డిగ్రీలయొక్క ప్రయోజన మేమిటి?! ఈనాటి విద్య కేవలం బాహ్యమైన, భౌతికమైన జీవితమునకు కొంత సహాయం చేస్తున్నది. అంతేకాని, ఇందులో 'ఇన్నర్' (అంతర్ముఖమైన) జీవితానికి తగినటువంటి ఆధారములు కనిపించడం లేదు. ఏమిటవి? మొదటిది సత్యము, రెండవది ధర్మము, మూడవది శాంతి, నాల్గవది ప్రేమ, ఐదవది అహింస. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలే మనకు నిజమైన, భద్రమైన, శాశ్వతమైన స్వరూపాలు. సత్యమే అన్నింటికినీ ప్రధానమైన మూలము.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యంబునందణగె సర్వసృష్టి**
**సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధసత్త్వమిదియె చూడరయ్య**

ఈ ప్రపంచములో చీమ మొదలుకొని ఏనుగువరకును సకల జీవరాశులకు భగవంతుడే సృష్టికర్త. కాబట్టి, ఏ ఒక్కటికూడను భగవత్సంకల్పము లేక జరుగదు. మీరు చూచేటటువంటి చిన్నచిన్న చీమలుకూడను భగవంతునియొక్క సంకల్పమువల్లనే పుట్టుచున్నవి. త్యాగరాజు చెప్పాడు – "చీమలో బ్రహ్మలో శివ కేశవాదులలో ప్రేమమీర వెలసియుండే బిరుదు వహించిన రామా నన్ను బ్రోవరా." చీమలో, బ్రహ్మలో ఒకే దైవత్వమున్నదని మనము చదువుతున్నాము. కాని, చీమ వచ్చి మనలను కుట్టెనా, తక్షణమే దాన్ని కొట్టి చంపుతాము. అదే బ్రహ్మ వచ్చినప్పుడు రెండు చేతులూ జోడించి నమస్కారం

చేస్తాము. ఆకారములు వేరువేరుగా ఉండినప్పటికీ అన్నింటియందున్న ఆత్మతత్త్వము ఒక్కటే అనేటటువంటి భావాన్ని నమ్మినటువంటివారికి ఎప్పటికీ ఎక్కడా ఎట్టి సమస్యకూడను ఉండదు. ఆత్మవిశ్వాసము గలవారికి ఎక్కడైనను అన్నీ లభిస్తాయి.

**మూలాధారమును విస్మరించడమే కష్టాలకు మూలం**

ప్రతి మానవుడు తాను కోరేటటువంటి ప్రతి కోరిక కూడను తనకోసమే కోరుతున్నాడు. 'నాకిది కావాలి, నాకది కావాలి' అని అంటున్నాడు. 'ఇది నా దేహము, ఇది నా మనస్సు, ఇది నా శిరస్సు' అంటున్నాడు. అయితే, 'నాది' అనేవారెవరు? 'నా దేహము' అంటావు. ఈ దినము, రేపటి దినము ఇది నీ దేహముగా ఉంటుంది. ఎల్లుండి నీ దేహమెక్కడ?! దీనిని ఎంతో ప్రేమతో, విశ్వాసముతో పెంచి పెద్ద చేస్తున్నావు. కాని, ఈ దేహము నీది కాదు. ఇది భగవంతుడు ఇచ్చినటువంటి 'గిఫ్ట్' (కానుక). ప్రతి ఒక్కటికూడను భగవంతునియొక్క 'గిఫ్టే'! ఇదొక వస్త్రము. ఇది ఎక్కడినుంచి పుట్టింది? ఆకాశమునుంచి వచ్చిందా? లేదు, లేదు. ప్రత్తినుంచి వచ్చింది. ప్రత్తి నుంచి దారము తయారైంది. ఆ దారమే ఈ వస్త్రముగా మారిపోయింది. కనుక, వస్త్రము కావాలంటే దీనికి ప్రత్తియే ఆధారము. అదేవిధముగనే, ప్రతిదానికి ఒక మూలాధారముంటుంది. అదే దైవము. అటువంటి మూలాధార తత్త్వమును మరచిపోవటంచేతనే మనం అన్నివిధములుగా కష్టములకు గురి అవుతున్నాము.

'దేవుడు, దేవుడు, దేవుడు...' అని మీరంటున్నారు. అయితే, దేవుడెక్క డున్నాడని మీరనుకుంటున్నారు? God is with you, in you, around you. You are God (భగవంతుడు నీతోనే ఉన్నాడు, నీలోనే ఉన్నాడు, నీ చుట్టూ ఉన్నాడు. అసలు నీవే భగవంతుడవు). ఆ విశ్వాసమును మనస్సులో దృఢముగా పెట్టుకోవాలి. భగవంతుడు మిమ్మల్ని వదలి ఎక్కడికీ పోడు. ఇన్ని కోట్లమంది జనులలో ఉన్నటువంటి ఆత్మ అనే భగవంతుడు ఒక్కడే. ఈ జగత్తులో మనకు వివిధ నామములు, వివిధ రూపములు కనిపిస్తున్నాయి. కాని, అన్నింటిలో ఉన్న ఆత్మతత్త్వం ఒక్కటే. శృంగారములు వేరు, బంగారమొక్కటే. ఆభరణములు వేరువేరు కాని, వాటిని కరిగించినప్పుడు మిగిలేది బంగారమొక్కటే కదా! కనుక, దివ్యాత్మస్వరూపులారా! మూలాధారమైన వస్తువును గుర్తించడానికి మీరు ప్రయత్నించాలి. "నేను వేరు, నా తల్లి వేరు, నా తండ్రి వేరు" అని

sri sathyasai vahini amrutam

మీరు భావిస్తున్నారు. నీవు, నీ తల్లి, నీ తండ్రి ముగ్గురూ చేరి ఒక్కటే; వేరువేరు అనే భావనే రానీయకూడదు. A man with a dual mind is half blind (ద్వైధీభావ చిత్తుడు సగం గ్రుడ్డివాని క్రిందికే లెక్క). కనుక, మీరు dual mind ను పెట్టుకోకూడదు.

**ప్రేమ, విశ్వాసము రెండూ చేరినప్పుడే మీ అభీష్టము నెరవేరుతుంది**

మీరు చదివే చదువులు కేవలం మీకోసం కాదు; మీ తోటి మానవునకు, జంతువులకు, క్రిమి కీటకాదులకుకూడా మీరు సహాయం చేయాలి. అప్పుడే మీరు నిజమైన చదువు చదివినవారవుతారు. ప్రతి ఒక్కరినీ ప్రేమించాలి. ఎవ్వరినీ ద్వేషించకూడదు. మీ శత్రువయినా సరే, ఎదురుగా వస్తే ప్రేమతో 'హలో, హలో' అని అతనిని పలుకరించాలి. అయితే, స్వామికి ఎవరైనా గిట్టనివారున్నారా అని మీరు ప్రశ్నించవచ్చు. అందరూ నా ప్రేమకు పాత్రులే! అందరియందు నా ప్రేమనే ఉంటున్నది. నేను ఎవ్వరినీ ద్వేషించను. ఎవ్వరినీ కష్టపెట్టను. ఎవ్వరికీ ద్రోహము చేయను. కనుక, స్వామిపైన ఎవ్వరికీ ద్వేషము లేదు. నాలో ఏకాత్మభావము గట్టిగా ఉండటంచేతనే ఇంతమంది నన్ను ప్రేమిస్తున్నారు. ప్రపంచమంతా నన్ను ప్రేమిస్తున్నది. నేను ప్రపంచమునంతా ప్రేమిస్తున్నాను. నా మాట, నా ఆట, నా పాట, నా జీవితము సర్వంకూడను మీకోసమే అర్పితమైంది. ఇట్టి తత్వాన్ని మీరు అర్థం చేసుకోవాలి. ఆ విశ్వాసాన్ని మీరు పెంచుకోండి. విశ్వాసము మీయందు ఉండినప్పుడు ప్రేమ దానియందే ఆవిర్భవిస్తుంది. ఆ ప్రేమ, ఆ విశ్వాసము రెండూ చేరినప్పుడే మీ అభీష్టము నెరవేరుతుంది. ప్రేమ, విశ్వాసము – ఈ రెండూ చాలా ముఖ్యము. మిగిలినవన్నీ ఏవో మధ్యలో వచ్చిపోయే 'పాసింగ్ క్లౌడ్స్' (కదలిపోయే మేఘాలు). వాటిని మనము లెక్కచేయకూడదు. మీ ప్రేమ, మీ విశ్వాసము – ఈ రెండింటినీ భద్రంగా పెట్టుకోవాలి. ప్రేమయొక్క ప్రతిబింబమే విశ్వాసము. ఈ ప్రేమ అనేది దైవ స్వరూపమే. ప్రేమయే దైవము. ప్రేమలో జీవించండి. సత్యము సత్యమే. ఇది ఎప్పటికీ మారదు. కనుక, సత్యమే దైవము. భగవంతుడు ప్రత్యేకంగా ఉన్నాడని మీరు భావించరాదు. ఈ ప్రపంచమంతా భగవంతునియొక్క స్వరూపమే. అట్టి ఏకత్వమైన దైవత్వాన్ని మీరు నిరంతరము స్మరిస్తూ ఉండాలి.

**జగత్తులో మంచి తప్పు చెడు అనేది ఎక్కడా లేదు**



sri sathyasaivachanamrutam

పిల్లల్లారా! మీరు అనేకరకములైన గ్రంథములు చదువుతున్నారు. కాని, మీరు ఎన్ని చదివినప్పటికినీ అన్నింటియందు అక్షరాలు మాత్రం ఒక్కటిగానే ఉంటాయి. కేవలం 26 అక్షరాలతోనే పెద్దపెద్ద పుస్తకాలు రాస్తున్నారు. చాలామంది లాయర్స్ పెద్దపెద్ద పుస్తకాలు మోసుకొని పోతుంటారు. వాటన్నింటికీ ఆధారము అక్షరాలే కదా! అదేవిధముగనే, మన ఆరోగ్యముగాని, ఆనందముగాని, సంతోషముగాని, సౌఖ్యముగాని అన్నింటికీ మూలాధారము దైవమే! మంచి, చెడ్డలకు మూలము భగవంతుడే! అసలు చెడ్డ అనేది జగత్తులో ఎక్కడా కనిపించదు. ఎక్కడ చూసినా కనిపించేది మంచియే! కాని, ఆ మంచిని మీరు సరిగా అర్థం చేసుకోలేక దానిని చెడ్డగా భావిస్తున్నారు. కేవలం 'డిఫరెన్స్ ఆఫ్ టైమ్'వల్లనే అది చెడ్డగా అనిపిస్తున్నది. ఈపొద్దు సాయంకాలము మనము భుజించినటువంటి మంచి పదార్థం తెల్లవారేటప్పటికి మలంగా మారిపోతుంది. ఈనాడు మనం ఫలము భుజిస్తే, రేపు అది మలముగా మారిపోతుంది. ఈ మంచిచెడ్డలయొక్క ఏకత్వమును మనము గుర్తించాలి. అందులోనే ఉన్నది దివ్యత్వము. దైవము అన్నింటియందు ఉంటున్నాడు. దైవము లేని స్థానమే లేదు. దైవము ఇక్కడ ఉన్నాడని, అక్కడ లేడని చెప్పడానికి ఎవరికీ అధికారం లేదు. సర్వత్రా ఉన్నది ఒక్కటే, అదే దైవము. కాని, దైవమునకు అనేక రూప, నామములు కల్పించి జగత్తును తబ్బిబ్బు చేస్తున్నారు. ఈ 'కన్ఫ్యూషన్'కు మూలకారణం దేహముయొక్క సంబంధమే. దీనిని మనము కొంతవరకు దూరము చేసుకోవాలి. అందుకోసమే ఈ విద్యలన్నీ మనము అభ్యసిస్తున్నాము. ఏనాడు ఈ సంబంధము దూరమై ఏకత్వము గోచరిస్తుందో ఆనాడే సర్వము ఏకమైపోతుంది.

**నా దృష్టిలో అందరూ ఒక్కటే! కాబట్టి, నాకెప్పుడూ ఆనందమే!**

**మతములన్నియు వేరు, గమ్యంబు ఒక్కటే**
**వస్త్ర భేదము వేరు, వస్తువు ఒక్కటే**
**జీవజాతులు వేరు, జీవుండు ఒక్కడే**

ఇంతమంది జీవులు ఇక్కడికి వచ్చి కూర్చున్నారు. అయితే, నిజానికి దేహాలు మాత్రమే వేరువేరుగా ఉన్నాయికాని, ఈ దేహాలలో ఉన్నది ఒకే ఒక దేవుడు. కనుక, మనము ఎవరిని

sri sathyasai vachanamrutam

చూచినా దైవస్వరూపులుగానే భావించాలి, ప్రేమించాలి. ఈ దేహభ్రాంతులు, ఈ మనస్సుయొక్క భావములు – వీటివల్లనే ఒకరినొకరు వేరువేరుగా చూసుకుంటున్నారు. దానివల్లనే ఈ కష్టములు సంభవిస్తున్నాయి. ఈ కష్టములకు కారణం మనమే. మంచిచెడ్డలు రెండుకూడను మన మనస్సునందే పుట్టుచున్నవి. మనస్సు మనలను అనేక రకములైన ఆటలు ఆడిస్తుంది. కనుక, మీరు ఎన్ని చదువులు చదివినప్పటికీ, ఎన్ని డిగ్రీలు పొందినప్పటికీ మొట్టమొదట ఆత్మతత్త్వమును ఒక్కటిగా తీసుకోండి. 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ', 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి', ఈ సత్యాన్ని హృదయంలో భద్రం చేసుకోండి. మీరు ఎవరినైనా ద్వేషిగా భావిస్తే, అది మీకు వానిపైనున్నటువంటి ప్రేమతత్త్వములో మార్పే గాని అతనిలోని మార్పు కాదు. ఈ ప్రపంచములో ప్రతి ఒక్కటికూడను 'రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్'. కాని, 'రియాలిటీ' ఒక్కటే. ఈవిధంగా భావించుకుంటే ఎంతటి ఆనందమునైనా అందుకుంటాము. "స్వామి ఎప్పుడూ ఆనందంగా నవ్వుతుంటాడే!" అని మీరు ఆశ్చర్యపడుతుంటారు. నాకెప్పుడు కూడను ఆనందమే! కారణం నా దృష్టిలో అందరూ ఒక్కటే. మీ అందరి ఆనందమే నా ఆహారము. కనుక, మీరు అట్టి ఆనందాన్ని సాధించండి. మొన్న పిల్లలు దీనిగురించి ఒక డ్రామా వేశారు. దానిని చూసి నాకెంతో ఆనందమైంది.

**ఏకత్వంనుండి అనేకత్వం వచ్చింది, అనేకత్వంలో ఏకత్వం ఉన్నది**

అందరియందు ఉన్నటువంటిది ఏకత్వమే! 'I, We' (నేను, మనము) అని అంటున్నాము. 'We' అనేది ఎక్కడినుండి వచ్చింది? 'I' నుండియే వచ్చింది. 'I' లేకపోతే 'We' లేదు. 'I' అనేటటువంటిది ఒక్కటే. కాని, దేహాభిమానముతో 'I' (నేను) అనే మాటను ఉపయోగపెడుతున్నాము. ఈ 'I' ని అడ్డంగా కొట్టి నప్పుడు అది 'క్రాస్' (✝) అవుతుంది. అనగా, దేహాభిమానమును త్యజించమని 'క్రాస్' సూచిస్తున్నది. కాబట్టి, అందరూ ఒక్కటే అనే భావాన్ని మనము పెట్టుకోవాలి. "వీరందరూ నా సోదర సోదరీమణులే" అని భావించండి. 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్' తప్ప మరొకరు ఎక్కడా లేరు. ఈ 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్' కూడను వేర్వేరు కాదు. ఇరువురూ చేరి మరి ఒక్కటే. అన్నిరకములుగా మనము విచారణ చేస్తే – ఈ జగత్తులో ఉన్నది ఒక్కటే ఒక్కటి. ఈ ప్రపంచంలో అనేకత్వము ఉన్నదని మీరు భావిస్తున్నారు. కాని, అనేకత్వము లేదు; ఉన్నది ఒక్కటే. ఆ ఏకత్వాన్ని మనము

sri sathyasai vahini amrutam

హృదయంలో దృఢం చేసుకుంటే, అన్నింటియందును అదే గోచరిస్తుంది. నీవొక అమ్మాయిని ప్రేమించావనుకో. ఆ అమ్మాయి ఎవరు? నీవే! నిన్ను నీవు ప్రేమించుకున్నట్లే! ఆ అమ్మాయిని వేరుగా భావించుకున్నప్పుడు ఆమెను 'నా భార్య' అంటావు. కాని, ఏకత్వాన్ని గుర్తించినప్పుడు ఇరువురూ ఒక్కటే. ఒక వ్యక్తి ఒక సభలో తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ "బ్రదర్స్ అండ్ సిస్టర్స్ ... ఒకరు తప్ప" అన్నాడు. ఆ ఒకరు ఎవరంటే, "నా భార్య" అన్నాడు. ఆ సభలో అతని భార్యకూడా ఉంది. అయితే, తాళి కట్టడంచేతనే కదా ఆమె అతని భార్య అయింది. లేకపోతే భార్య ఎవరు! భర్త ఎవరు! కాబట్టి, అందరూ ఒక్కటే. ఇట్టి ఏకత్వాన్ని మీరు చక్కగా గుర్తించుకోండి. ఈ ప్రపంచంలో అన్నింటియందు ఏకత్వం ఉన్నది. ఆ ఏకత్వమే అనేకత్వంగా మారిపోతున్నది.

**చదువుకున్నవారంతా విద్యావంతులనిపించుకోరు**

ప్రేమస్వరూపులారా! విద్యార్థులారా! వారు, వీరు అనే భేదము పెట్టుకోకండి. All are one. Be alike to everyone (అందరూ ఒక్కటే. అందరిపట్ల సమత్వంతో వర్తించండి) అప్పుడే మీరు విద్యావంతులనిపించుకుంటారు. లేకపోతే మీరు కేవలం చదివి వ్రాయ నేర్చినవారనుకోవచ్చు. చదువుకున్నవారికి, విద్యావంతులకి మధ్య ఎంతో వ్యత్యాసమున్నది. విద్యావంతుడంటే ఎవరు? అందరూ ఒక్కటే అని గుర్తించినవాడు. 'ఎడ్యుకేషన్' అనగా ఏమిటి? చదువు. విద్య అనగా ఏమిటి? ఏకత్వాన్ని నిరూపించేటటువంటిది; మన జీవితంలో వెలుగు నింపేటటువంటిది. ఈ విద్య అనే వెలుగును పోగొట్టుకుంటే మనము అజ్ఞానమనే చీకటిలో జీవించవలసివస్తుంది.

ప్రేమస్వరూపులారా! మీయందున్న ప్రేమను భగవంతునిపైన పెంచుకోండి. ఏదో ప్రపంచంలో ఉన్నటువంటివారిపైన మీ ప్రేమను మరల్చుకుంటే అది సారెసారెకూ మారుతుంటుంది. ఏ భేదములూ పెట్టుకోకుండా ఏకత్వంగా బ్రతకండి. మీకు చిక్కినదానిని సాటి వ్యక్తులతో పంచుకోండి. జీవితం శాశ్వతంగా ఉండాలనుకున్నప్పుడు మనం ఏకత్వాన్ని అనుభవించాలి. ఏకత్వభావన ఉన్నప్పుడు ఏ భేదమూ రాదు, ఏ క్రోధమూ రాదు, ఏ తప్పులూ జరగవు.

**మనస్సులో చింతకు ఏమాత్రము చోటివ్వకూడదు**

srisathyasaivachanamrutam

ప్రేమస్వరూపులారా! నా దేహము చక్కగా ఉన్నది. దేహము మాత్రమే కాదు, నాకన్నీ చక్కగానే ఉన్నాయి. నా మనస్సు అటూ ఇటూ ఎప్పుడూ పోదు. దేహము మారవచ్చు. కాని, నేనెప్పుడూ ఒకటిగానే ఉంటాను. "స్వామీ! మీరెప్పుడూ నవ్వుతూనే ఉంటారే! మీకు దుఃఖము రాలేదా?" అని ప్రశ్నిస్తారు, కొందరు. దుఃఖమనేది ఎప్పుడూ నాదగ్గరకే రాలేదు. ఎప్పుడు ఏది జరగవలెనో అది జరగనే జరుగుతుంది. నీవు ఊరకే విచారము పెట్టుకుంటే అది తప్పుతుందా? అది మరింత విచారమునకు దారితీస్తుంది. కనుక, చింతను దగ్గరకే చేర్చుకోకూడదు. ఒకసారి చింత మనస్సులో ప్రవేశిస్తే అది బయటికి పోదు. కనుక, మీరేమాత్రము చింతకు చోటివ్వకూడదు. 'పరీక్షలు వస్తున్నాయి. అయ్యో, నేను ఎట్లా రాస్తానో ఏమో' అని విద్యార్థులు భయపడుతుంటారు. తెలిసినవి రాయడానికి భయమెందుకు? తప్పక రాస్తావు. భయమే పడకూడదు. ఎవరైనా తుపాకీ పట్టుకొని కాల్చడానికి వచ్చినా నీవు భయపడకూడదు. దేహాన్ని కాల్చగలరుగాని, మనసును ఎవరైనా కాల్చగలరా! బుద్ధినెవరైనా కాల్చగలరా! ఆత్మను ఎవరైనా కాల్చగలరా!

ఆత్మ ఎంత దూరంలో ఉన్నది? సర్వత్రా ఉన్నది. 'ఆకాశం ఇంత దూరంలో ఉన్నది' అని ఎవ్వరూ చెప్పలేరు. కనుకనే, sky is blue (ఆకాశం నీలంగా ఉన్నది) అన్నారు. సముద్రం ఎంత లోతుగా ఉంది? దానినికూడా ఎవరూ చెప్పలేరు. కనుకనే, ocean is blue (సముద్రం నీలంగా ఉన్నది) అన్నారు. అదేరీతిగా, భగవత్తత్వాన్నికూడా ఎవ్వరూ వర్ణించలేరు. కనుకనే, భగవంతునికి 'బ్లూ కలర్' (నీలవర్ణము)ను ఆపాదించారు. అంతేగాని, భగవంతుడు నీలవర్ణుడు కాదు. నిజంగా నీలవర్ణుడై పుట్టినాడంటే ఆయనని మీరు ఏ ఎగ్జిబిషన్‌లోనో పెట్టియుందురు. దైవత్వానికి ఎవ్వరుకూడను ఎట్టి మార్పులూ చేయలేరు. మీరు మారవచ్చు. కాని, మీ ఆత్మ ఎప్పటికీ మార్పుచెందదు. "నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మలస్వరూపిణం." కనుకనే, "బుద్ధి గ్రాహ్య మతీంద్రియం" అన్నారు. ఇటువంటి ఆత్మతత్వాన్ని మీరు మార్చడానికి వ్యర్థ ప్రయత్నం చేయకండి.

**'మీకు నన్ను నేనే ఇచ్చుకున్నాను'**

విద్యార్థులారా! మీరు 'గుడ్ బాయ్స్' (మంచి పిల్లలు) అనే పేరు తెచ్చుకోండి.

sri sathyasai vahini.org

తల్లిదండ్రులకు కీర్తిని తెండి. మీ సమాజమునకుకూడను మంచిపేరు తెండి. ఈ సొసైటీ బాగుపడాలంటే పిల్లలనుంచే బాగుపడాలి. ఈనాడు మన స్టూడెంట్స్ ఎక్కడికి పోయినప్పటికీ ఎంతో మంచివారని పేరు తెచ్చుకుంటున్నారని నేను వింటున్నాను. ఆ పేరును మీరు నిల్పుకోండి. నాకు అంతకంటే ఆశ మరొకటి లేదు. మీకేది కావలసినా నేనిస్తాను. నన్ను నేనే ఇచ్చుకున్నాను. మీరందరూ ఆనందంగా ఉండండి. ఒకరితో ఒకరు పోట్లాడకండి. ఒకరినొకరు తిట్టుకోకండి. అందరుకూడను అన్నదమ్ములవలె ఉండండి. అటువంటి సమత్వమును పోషించునదే నిజమైన చదువు. "చదువు చదివి చదివి చావంగనేటికి?! చావు లేని చదువు చదువవలయు." మీ తల్లిదండ్రులను మొట్టమొదట సంతోష పెట్టండి. మిమ్మల్ని కని పెంచి పోషించిన మీ తల్లిదండ్రులకు ఆనంద మివ్వలేకపోతే మీరు నాకేమి ఆనందము ఇవ్వగలరు?! మీరు ఇంట్లో తల్లిదండ్రుల చెంతచేరి ఆనందంగా ఉండినప్పుడు నాకుకూడా ఆనందమే. సత్యసాయి కాలేజిలో చదివిన పిల్లలు మంచివారు అని పేరు వచ్చినప్పుడు ఈ కాలేజికి మంచిపేరు, మీకూ మంచిపేరు.

మీరు ఢిల్లీకి పోయి విచారిస్తే మీకే తెలుస్తుంది - సత్యసాయి స్కూలు, సత్యసాయి కాలేజిలకు గవర్నమెంటులో ఎంతో గొప్ప పేరుంది. ఏ స్కూలూ కాలేజిలకీ రాని గుర్తింపు మన కాలేజికి వచ్చింది. ఎన్నో కాలేజిలు పనిచేయడం ప్రారంభించి ఎన్నో సంవత్సరములైనప్పటికీ వాటికి గుర్తింపు లేదు. కాని, మన కాలేజి పనిచేయడం ప్రారంభించిన రెండవ సంవత్సరమే ఢిల్లీనుండి మాధురీషా (అప్పటి యు.జి.సి. ఛైర్‌పర్సన్) వచ్చి దీనిని యూనివర్సిటీగా చేయాలి అన్నది. "రెండు సంవత్సరములుకూడా పూర్తి కాలేదు. అప్పుడే దీనికి యూనివర్సిటీగా గుర్తింపు ఇవ్వవచ్చా?" అని అనేకమంది ఆమెతో వాదించారు. నా ప్రక్కనే ఉండి అనువాదం చేస్తున్నాడు, భగవంతం. ఆయనకూడా సైంటిస్టే. అప్పుడాయన నెమ్మదిగా, "స్వామీ! ఇట్ ఈజ్ ఇమ్‌పాజిబుల్, ఇమ్‌పాజిబుల్" (ఇది అసాధ్యము, అసాధ్యము) అని చెప్పాడు. నేను గట్టిగా చెప్పాను, "ఇట్ ఈజ్ పాజిబుల్" (ఇది సాధ్యమే) అని. రెండవ సంవత్సరము కమిటీ వచ్చింది. అందరూ దీనిని చూశారు. "ఇది అత్యుత్తమమైన కాలేజి. కాబట్టి, దీనికి యూనివర్సిటీ అని పేరు పెట్టాలి" అని అన్నారు. మళ్ళీ మాధురీషానే వచ్చి ప్రారంభోత్సవం జరిపింది. అప్పుడామె పబ్లిక్‌లో చెప్పింది,

srisathyasaivahini

"భగవంతం! నీవు 'ఇంపాజిబుల్' అన్నావు. మరి ఇప్పుడు ఎట్లా 'పాజిబుల్' అయింది?" అయితే, ఇది మరొకరికి సాధ్యమయ్యేటటువంటిది కాదు.

మా పిల్లలందరుకూడను చక్కని గుణవంతులు, చక్కని చదువరులు, చక్కని బుద్ధిమంతులు. మన కాలేజికి అమెరికాలో ఎంత గొప్ప పేరుందో మీకు తెలియదు. మన కాలేజి పిల్లలు అమెరికాలో నూట ఎనభైమంది ఉన్నారు. వారందరూ కలిసి ఇక్కడికి వచ్చారు. స్వామి సన్నిధిలో ఎక్కువ రోజులు గడపాలని వాళ్ళు తమ ఇళ్ళకుకూడా పోలేదు. "స్వామీ, మేము ఇళ్ళకు పోము. ఇక్కడినుంచి అమెరికాకే వెళతాము" అన్నారు. గోల్డ్‌స్టీన్ ఇక్కడే ఉన్నాడు. ఆయన ఇరవై సంవత్సరములనుండి అమెరికాలో సత్యసాయి సంస్థకు ప్రెసిడెంటుగా ఉన్నాడు.

భగవాన్ ఆదేశం మేరకు డా॥ మైఖెల్ గోల్డ్‌స్టీన్ వేదికపైకి వచ్చి ప్రసంగిస్తూ ఇలా అన్నారు:

"అమెరికాకి వచ్చిన సాయి విద్యార్థులద్వారా ఒక్క అమెరికాకేగాక మొత్తం ప్రపంచానికే కలుగుతున్న అనుభవం ఏమిటంటే, సాయి సంస్థకి వాళ్ళు వెలుగు తేవడం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 200 దేశాలలో స్వామి యొక్క ప్రేమజ్యోతి సాయిభక్తులకి దివ్యత్వ స్ఫూర్తిని అందిస్తున్నది. ఈ పూర్వ విద్యార్థులు స్వామి సందేశాన్ని, స్వామి ప్రేమని తీసికొని వచ్చి భక్తులకు తమలో ఉన్న దివ్యత్వాన్ని ఆవిష్కరింపజేసుకోవడానికి ఉత్తేజాన్ని కలిగిస్తున్నారు. స్వామి సన్నిధిలో వారి దివ్యపాదాలచెంత వారి విశ్వవిద్యాలయంలో చదివి వారి దివ్యప్రేమకూ, వారు ప్రపంచానికి కలిగిస్తున్న ఉత్తేజానికీ మీరు రాయబారులవుతూ ఉండటంవల్ల మీరెంత అదృష్టవంతులైందీ గుర్తించాలి. ఒకవేళ అవసరమై నేను మరొక జన్మ ఎత్తాల్సి వస్తే నన్ను ఈ విశ్వవిద్యాలయ విద్యార్థిగా చేయమని స్వామిని ప్రార్థిస్తున్నాను."

(ఈవిధంగా డా॥ మైఖెల్ గోల్డ్‌స్టీన్ మాట్లాడిన తర్వాత జాతీయ గీతాలాపనతో స్నాతకోత్సవ సభ ముగిసింది. ఆ తర్వాత తమ ప్రక్కనే ఆసీనులైయున్న జస్టిస్ పి.ఎన్. భగవతిగురించి

srisathyasaivahini.org

భగవాన్ కొన్ని ప్రశంసావాక్యాలను ఆర్ద్రంగా మాట్లాడారు)

చాలాకాలం క్రిందట జస్టిస్ భగవతి అహమ్మదాబాద్‌లో పనిచేస్తుండగా నేను "నువ్వు త్వరలో ఢిల్లీకి పోతావు. లగేజి ప్యాక్ చేసుకో" అని చెప్పాను. "లిస్టులో నా పేరే లేదే! ఎట్లా నేను పోతాను?" అని ఇతను కొంచెం సందేహించాడు. అయితే, నేను చెప్పినట్లుగానే ఇతనికి ఆర్డర్ వచ్చేసింది, సుప్రీం కోర్టు జడ్జిగా నియమింపబడినట్లు! ఆ తరువాత ఇతను సుప్రీం కోర్టు ఛీఫ్ జస్టిస్ కూడా అయినాడు. ఆనాటి మొదలుకొని ఈనాటివరకు స్వామిని ఒక్క నిమిషమైనా మరువలేదు. కనుకనే, ఇతను నావాడు.

జస్టిస్ భగవతి స్వామి వాక్యాలకి స్పందిస్తూ ఇలా అన్నారు:

"నాలో కలుగుతున్న భావాలని చెప్పడానికి నావద్ద మాటలు లేవు. స్వామి నాయందు చూపిన దయని, ప్రేమని నేను ఎన్నడూ మరువలేను. నా జీవితాన్ని వారు తీర్చిదిద్దారు. నేను ఇవాళ ఇంతటి వాడనయ్యానంటే, అది మొత్తంగా వారి దివ్యానుగ్రహంచేతనే! ఒక్క ఈ జీవితం వరకేగాక రాబోయే అన్ని జన్మలలోనూ వారు నాకు దివ్యగురువుగా ఉండాలని, నేనిట్లాగే వారికి సేవచేసే అవకాశం నాకుండాలని నేను వారిని ప్రార్థిస్తున్నాను."

**(తేదీ 22.11.2007, విశ్వవిద్యాలయ 26వ స్నాతకోత్సవం)**

sri sathyasaivachanamrutam